## ఈ వారం కథ

# క్షమించు మిత్రమా!



◆ గుడిసేవ మురళీధర్

పాండు రంగారావుకి రిటైరయ్యాక బస్తీలో వుండటం కష్టమనిపించి బస్తీకి పది కిలోమీటర్ల దూరంలో వున్న తన స్వగ్రామానికి వచ్చేసాడు. నిజానికి అతనికి బస్తీలో ఇల్లు వుంది.

ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. కొడుకులు పెళ్ళిళ్లు చేసుకొని కాపురాలు పెట్టటంతో ఇల్లు ఇరుకయింది. కోడళ్ళ పెత్తనం ఎక్కువయింది. అందుకే పాండు రంగారావు స్వగ్రామానికి వచ్చేసాడు. కూతురుకి ఎన్ని పెళ్ళి సంబంధాలు తెచ్చినా కుదరటం లేదు. తక్కువ వాడికి ఇవ్వలేదు, ఎక్కువ వాడు రాడు. చెల్లెలి పెళ్లి కుదిరే వరకు అన్నలు ఆగ లేదు. ఇటువంటి పరిస్థితిలో పాండు రంగారావు స్వగ్రామానికి వచ్చేసాడు.

వచ్చి రావటంతోనే తమ పాత ఇల్లుని బాగు చేయడం మొదలుపెట్టాడు. పెంకుటిల్లు డాబాగా మారింది. ఇంటి ముందు తోట, తోట మధ్యలో తులసి కోట వచ్చాయి. పేరుకి పల్లెటూరే గాని ఆ ఊరికి పట్టణ సౌకర్యాలు ఏర్పడ్డాయి. పట్టణాలకు వలస పెరిగి పట్టణాలు ఇరుకయిపోయాయి. దానితో ఆ పట్టణ పరిసర ప్రాంతాలకు కూడా పట్టణ లక్షణాలు వచ్చేస్తున్నాయి. కూతురు రాజ్యలక్ష్మి కాన్వెంట్ పెడతానంటే వెంటనే ఒప్పుకున్నాడు. రోజూ ఉదయం కాన్వెంట్ పనితో పాండురంగారావుకి దినచర్య మొదలవుతుంది. మధ్యాహ్నం పదకొండు గంటల సమయంలో పని ముగించుకొని, కాసేపు పేపరు తిరగేసి, భోజనం చేసి హాయిగా నిద్రపోవడం, సాయంత్రం కాగానే స్నానం చేసి ఊరి చివరకు షికారుకెళ్ళి అందమైన ఆకాశాన్ని చూసి ఇంటికి రావడం. స్వగ్రామం వచ్చాక తన జీవితం ఆనందంగా గడచిపోతున్నదని అనుకున్నాడాయన.

పాండురంగారావు ఇంటి ప్రక్కనే అబ్దుల్ రషీద్ ఇల్లు వుంది. పాండురంగారావు కంటే రెండు సంవత్సరాలు ముందే ఆ ఊరు వచ్చి ఇల్లు కట్టుకున్నాడు రషీద్. ఉదయం పాండురంగారావు తన పెరట్లో నిలబడితే అబ్దుల్ రషీద్ ఆవు పాలు పితుకుతున్న దృశ్యం కనబడుతుంది. ఆయనకు ఆవులంటే ప్రాణం. ఒంటరివాడు. ఆయన ఢిల్లీలో ఒక పెద్ద హోటల్‌లో మేనేజర్‌గా రిటైరయి ఇక్కడకు వచ్చి స్థిరపడ్డాడు. ఉద్యోగంలో వుండగానే భార్య మరణించింది. అతని ఏకైక సంతానం ఒక కూతురు. ఆమె ఢిల్లీలో భర్తతో కలిసి వుంది. రషీద్ అందరితోనూ ముభావంగా వుంటాడు.

రోజులన్నీ ఒకే విధంగా వుంటే కాలానికి ప్రత్యేకత వుండదు. స్నేహం ఒక్క క్షణంలో విరోధంగా మారవచ్చు. సర్దుకుపోకపోతే మనుష్యుల మధ్య అగాధాలు ఏర్పడతాయి. పాండురంగారావు భార్య ఆండాళమ్మకు ఒక విషయం నచ్చలేదు. అదేమిటంటే రషీద్ ఆవు తమ పెరట్లోకి తరచుగా రావటమే.

"ఆవుని కట్టేసుకోక అలా ఊరిమీదకు వదిలిపెడతాడేమిటండీ ఆయన? మనం మొక్కలు పెంచుకోనక్కరలేదా ఏమిటి పాడు కర్మ" అంది ఆండాళమ్మ అన్నం వడ్డిస్తూ.

అది మామూలు విషయం లాగా తల వూపాడు పాండురంగారావు. మరుసటి రోజు సాయంత్రం స్నానం చేస్తుంటే రషీద్ కనిపించాడు ఆవుకి నీళ్లు పెడుతూ.

"మీ ఆవు మా తోటని బ్రతక నీయడం లేదు రషీద్" అన్నాడు పాండురంగారావు నవ్వు ముఖంతో.

"అంత ఇబ్బందిగా వుంటే ఇంటి గేటు మూసి వుంచుకో అంతేకానీ నా ఆవుని రోజంతా కట్టి వుంచడానికి వీలుగాదు" కొద్దిగా కోపంగానే అన్నాడు రషీద్. రషీద్ అలా అనగానే విషయం కదిపినందుకు తనని తానే తిట్టుకున్నాడు పాండురంగారావు. రషీద్ ముభావంగా వుంటాడనే సంగతి ఆ సమయంలో గుర్తుకు రాలేదు ఆయనకు. రషీద్ సంగతులు తెలవాలంటే అతని నౌఖరు రాంబాబు చెప్పాలి.

"వంట నువ్వే చేస్తావా రాంబాబు?" వివరాలు అడిగేవాడు పాండురంగారావు. "ఇతరులు వంట చేస్తే ఆయనకు నచ్చదండి. ఆయనే వండుకుంటాడు. ఒకపూట భోజనం, రాత్రిపూట పాలు, పళ్లు తీసుకుంటాడు" అంటూ రాంబాబు అక్కడి విషయాలు ఇక్కడకు చేరవేసేవాడు.

జీవితమంతా పట్టణాలలో గడిపిన ఈ సాయిబు ఈ పల్లెటూరిలో ఎందుకు స్థిర నివాసం ఏర్పరచుకున్నాడో? తానైతే కొడుకులతోను, కోడళ్లతోను వేగలేక ఇక్కడికి వచ్చి పడ్డాడు. పరిస్థితులు అనుకూలిస్తే అందరూ పట్ట



ణాలకు చేరేవారేగాని 'ప్రశాంత జీవితం కోసం' గ్రామాలను చేరేదెవరూ? అందులోను బస్తీ జీవితానికి అలవాటైన వాడు. పాండురంగారావుకి రషీద్ మనస్తత్వం ఏమిటో అర్థం కావటంలేదు.

ఆ రోజు వినాయకచవితి. ఒంటరివాడు కదా అని ఆండాళమ్మ ఇంట్లో చేసుకున్న పిండి వంటల్లో కొంత బూంది, నాలుగు కొబ్బరి వుండలు, కొన్ని వుండ్రాళ్ళు ఒక స్టీలు పాత్రలో వుంచి పనిమనిషితో రషీద్‌కి పంపింది. రషీద్ ఇంటికి వెళ్లిన పనిమనిషి వెంటనే వచ్చేసింది.

"ఆ అయ్యకి చిరు తిండ్లు తినే అలవాటు లేదంటమ్మగారు" అంది పనిమనిషి. ఆండాళమ్మ ఏమీ మాట్లాడకుండా పాత్ర తీసుకుంది.

"ఆ సాయిబుకి ఏమీ పంపకు, తింటే తన మతానికి అప్రతిష్ఠ అనుకుంటాడు" అన్నాడు పాండు రంగారావు. కాని ఆ మాటలు రాజ్యలక్ష్మికి నచ్చలేదు. ఆ విధంగా పాండురంగారావుకి అబ్దుల్ రషీద్ మీద కోపం పెరగసాగింది.

ఒకసారి రషీద్‌కి జ్వరం తగిలింది. డాక్టరు వచ్చి ఏవో మందులు రాసిచ్చి వెళ్లాడు. నాలుగు రోజుల వరకు బయటకు రాలేదు. తరువాత కొద్దిగా తగ్గినట్లనిపించి బజారులోకి వెళ్లాడు. పని అయ్యాక ఇంటికి తిరిగివస్తూ కళ్లు తిరిగి పాండురంగారావు ఇంటి ముందు పడిపోయాడు. మొక్కలకు నీళ్లు పోస్తున్న రాజ్యలక్ష్మి అది చూసి ఆయనమరిక్షాలో డాక్టర్ శాంతి భూషణం హాస్పిటల్‌కు తీసుకువెళ్లింది. డాక్టర్ శాంతి భూషణం హౌస్ సర్జన్ పూర్తిచేసుకొని, ఆ ఊరిలో చిన్న నర్సింగ్ హోమ్ పెట్టాడు. అతను రషీద్‌ని పరీక్షచేసి హాస్పిటల్‌లో చేర్చుకున్నాడు. రషీద్ పది రోజులున్నాడక్కడ. రాజ్యలక్ష్మి రోజూ వెళ్లి చూసి వస్తోంది.

"బాబాయిని ఇవాళ డిశ్చార్జి చేస్తున్నారు నాన్న" అంది రాజ్యలక్ష్మి లోపలికి వచ్చి చెప్పులు విప్పుతూ.

"ఆ సాయిబు నీకు బాబాయ్ అయ్యాడన్న మాట. వాడి దగ్గరకు వెళ్ల వద్దంటే వినవు నువ్వు" పాండు రంగారావు కొద్దిగా కోపంగానే అన్నాడు.

"మతాలను బట్టికాక గుణాన్ని బట్టి మనుష్యుల్ని చూస్తే బాగుపడుతుంది నాన్నా మన దేశం. అసలు ఆయనంటే నీకెందుకు అంత కోపం?" అంది రాజ్యలక్ష్మి తీక్షణంగా చూస్తూ.

"నాకెందుకు కోపం? వాడికే నేనంటే కోపం" అన్నాడు పాండు రంగారావు కిటికీలోంచి రషీద్ ఇంటిని చూస్తూ.

అబ్దుల్ రషీద్ జబ్బు పడినప్పటి నుండి రాజ్యలక్ష్మి అప్పుడప్పుడూ ఆయనింటికి వెళ్లి పలకరించి వస్తోంది. ఆ పరిస్థితిలో రషీద్‌కి రాజ్యలక్ష్మి కొండంత అండగా కనిపించింది.

పాండురంగారావు, రాజ్యలక్ష్మికి ఒక సంబంధం చూసాడు. అబ్బాయి బ్యాంకు ఉద్యోగి. కట్నంతో ఇతర ఖర్చులను కూడా కలుపుకుంటే సుమారు మూడు లక్షల రూపాయిలవుతుంది. అందుకు పాండురంగారావు కాన్వెంట్‌ని అమ్మదలిచాడు. కాని రాజ్యలక్ష్మి ఆలోచనలు మరోలా ఉన్నాయి. ఆమె, డాక్టర్ శాంతి భూషణం ఒకరినొకరు ప్రేమించు కున్నారు. పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు.

రాజ్యలక్ష్మి ఈ విషయం గురించి రషీద్‌తో చర్చించింది. "ఇష్టంలేని పెళ్ళి చేసుకోవటం ఎందుకు? నీకు నచ్చినట్లయితె శాంతి భూషణాన్నే చేసుకో. శాంతి భూషణం నిజంగా పేరుకి దగ్గ మనిషి. వినయం, ఓర్పు కలవాడు" రషీద్ అనునయంగా అన్నాడు.

తల్లిదండ్రులకు ఈ విషయం ఎలా చెప్పాలో తెలియటం లేదు. కులాభిమాని అయిన తన తండ్రి ఈ సంబంధాన్ని అంగీకరిస్తాడన్న నమ్మకం లేదు. కానీ తనకు శాంతి భూషణం తగిన వరుడని తన అంతరాత్మ చెబుతోంది. పేషెంట్లు చెప్పేది శ్రద్ధగా వినటం, వారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరంగా చెప్పటం, వారి సందేహాలను తీర్చటం మొదలయినవి శాంతి భూషణం అంటే తాను ఇష్టపడటానికి కారణాలు.

ఈ ఆలోచనలతో రాజ్యలక్ష్మి రెండు రోజులు గడిపింది. చివరకు పరోక్షంగా తన ఆలోచనలను వెల్లడించింది. "అంతేసి కట్నాలు పోసి మనలాంటి వారు పెళ్ళిచేసుకోకపోతే ఏమవుతుంది నాన్నా? మీరు ఇల్లంతా తుడిచిపెట్టి పెళ్ళిచేస్తే, ఆ చేసుకొనేవాడు భార్యని గౌరవించేవాడని నేననుకోవాలా? అలా జరిగిన పెళ్ళిళ్ళు ఎన్ని చెడలేదు?" ఉద్రేకంగా అంది రాజ్యలక్ష్మి.

"నాకే ఉపన్యాసాలు ఇచ్చేదానివయ్యావా? నోరు మూసుకుని అవతలకి ఫో" పాండు రంగారావుకి కోపంగాను అవమానంగాను వుంది.

ఇక లాభం లేదనుకొని విషయం బయట పెట్టింది రాజ్యలక్ష్మి. "నేనూ శాంతి భూషణం పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం నాన్నా" తల వంచుకుని అంది రాజ్యలక్ష్మి.

"ఏమిటే వాగుతున్నావ్ వెర్రి మొగమా? క్రైస్తవ మతం తీసుకున్న వాడిని చేసుకుంటావా?" కోపంతో మండిపడుతూ అన్నాడు పాండురంగారావు. అతని చేతి వేళ్ళు గట్టిగా బిగుసుకున్నాయి.

"మతాలను బట్టి మనుష్యులను చూడకూడదు నాన్నా, గుణాన్ని బట్టి మనిషిని అంచనా వెయ్యాలి. పెద్దమ్మగారి అమ్మాయిని చేసుకున్నవాడు అదే కులం వాడే కదా, పెద్దలు చేసిన పెళ్ళే కదా, చివరకు ఏమయింది? ఉద్యోగం లేకపోయినా వుందని అబద్ధం చెప్పి రెండు లక్షల రూపాయిలు కట్నంగా తీసుకున్నాడు. సంవత్సరం అవక ముందే తన్నటం, డబ్బు తెమ్మనటం మొదలు పెట్టాడు. ఇదేనా మతం? అలాగే నువ్వు ప్రాణ స్నేహితుడగా చెప్పుకునే వినాయకరావు నీ దగ్గర నుండి అయిదు వేలు అప్పు తీసుకున్నాడు. పదేళ్ళయింది. తిరిగి ఇచ్చాడా? ఇంట్లో మాత్రం గ్రైండర్లు, ఫ్రిజ్, వాషింగ్ మెషిన్‌లు కొన్నాడు మన అప్పు మాత్రం ఇంత వరకు తీర్చలేదు. అతనిది కూడా మన కులమే, మన మతమే. ఇదేనా మతం" రాజ్యలక్ష్మి తీక్షణంగా చూస్తూ అంది.

"నీ వ్యవహారం బాగా ముదిరిపోయిందే, ఈ రోజు నుండి బయటకు వెళ్ళవద్దు. బయటకు వెళ్ళావంటే నేను మనిషిని కాదు. నువ్వు నా కూతురివి కావు" పాండురంగారావు విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

పది రోజుల తరువాత రాజ్యలక్ష్మి వీలు చూసుకుని శాంతి భూషణం హాస్పిటల్‌కి వెళ్ళింది. తరువాత వారిద్దరికి రిజిష్టర్ మ్యారేజ్ జరిగింది. అబ్దుల్ రషీద్ సాక్షి సంతకం పెట్టాడు. ఈ విషయం తెలిసిన పాండురంగారావు ఉగ్రుడై పోయాడు. కూతురి పెళ్ళికంటె, రషీద్ సాక్షి సంతకం చేయటమే ఆయనకు ఎక్కువ కోపకారణం అయింది. విసురుగా రషీద్ ఇంటికి వెళ్ళాడు. అదే అతను మొదటిసారిగా అక్కడకు వెళ్ళటం. "నా కూతురు పొరపాటు చేస్తే ప్రోత్సహిస్తావా? అది వేరే మతం వాడిని చేసుకుంటే నువ్వు వెళ్ళి సాక్షి సంతకం చేస్తావా?" రషీద్‌కి అతి దగ్గరగా నిలబడి అరుస్తున్నాడు పాండురంగారావు.

"నీ కూతురు పొరపాటు పని ఏమీ చేయలేదు. ఆమే ఎంతో అదృష్ట వంతురాలు. శాంతి భూషణం నీ అల్లుడైనందుకు సంతోషించు" నిదానంగా అన్నాడు రషీద్. ఒక మంచి మనిషి మరొక మనిషికి ఉపకారం చేస్తే

